క్లుప్తంగా

నేడు నల్లపురెడ్డిపల్లిలో బండలాగుడు పోటీలు

పెనగలూరు : పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లిలో శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. మొహర్రం సందర్భంగా గ్రామంలో ఈ పోటీలను జరుపనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు రూ. 500లు ఎంట్రీ ఫీజు చెల్లించి పాల్గొనాలన్నారు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంటకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.40 వేలు, తృతీయ బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ. 10 వేలు, ఆరో బహుమతి రూ.8 వేలు, ఏడవ బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

8న మండల సమావేశం

పెనగలూరు : జూలై 8వ తేదీన పెనగలూరు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ విజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలి

సుండుపల్లె : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మగ్గు చూపాలని ప్రకృతి వ్యవసాయ అధికారులు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో అదే గ్రామానికి చెందిన రైతు బాబురెడ్డి వ్యవసాయ అధికారులతో కలిసి ఒక ఎకరా డ్రాగన్ ఫ్రూట్స్ తోటకు 200 లీటర్ల జీవామృతం తయారుచేసి పిచికారీ చేసినట్లు తెలియజేశారు. ఈ విధంగా చేస్తే సుమారు 20 సంవత్సరాల పాటు తోట నుంచి నిలకడగా పంట దిగుబడి వస్తుందని చెప్పారు.

ప్రారంభమైన తిరునాల



నాగారపమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచాయతీ జీకే రాచపల్లి వద్దనున్న చెరువు దగ్గర కొలువైన నాగారపమ్మ తిరునాలను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సాంప్రదాయబద్ధంగా ఆలయ పూజారులైన రజకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా శనివారం పుట్టమన్ను తెచ్చి పూజించడంతో పాటు జల్డి సాంగెము పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మొక్కుబడుల్లో భాగంగా రాత్రికి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణచే చాందినీబండ్లు ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి ఆదివారం ఉదయం బోనాల కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



రాయచోటి టౌన్ : రాష్ట్రీయ బాల స్వస్థలో భాగంగా రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రోగాం అండ్ మానిటరింగ్ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్, డాక్టర్ వసీమ్ అక్రంలు కంటి పరీక్షలు, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్, బరువు, ఎత్తు, దంత పరీక్షలు జరిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు సూచనలతో పాటు ఉచిత వైద్యం అందించారు. కార్యక్రమంలో దంత వైద్యులు ఖదీర్ బాషా, సూపర్‌వైజర్ నూర్జాహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, రామచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వర్షాలు కురిపించు గంగమ్మ



పూజలు చేయిస్తున్న నాగభూషణ్‌రెడ్డి దంపతులు

గాలివీడు : వర్షాలు కురిపించి రైతాంగాన్ని సుభిక్షంగా ఉంచాలని గ్రామదేవత పేరంపల్లి ఆసర్ల గంగమ్మకు ఆ గ్రామ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల సునితమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్ రెడ్డి దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలో కరువు పరిస్థితులు దర్శనమిస్తుండటంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలియజేశారు.

అన్ని రంగాలలో అభివృద్ధి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణాంధ్ర పథకంపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అన్ని రంగాలపై అధికారులు దృష్టి పెట్టి అన్ని గ్రామాలు అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు

విప్లవ వీరుడికి నివాళులు అర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, క్షత్రియ సంఘాలు



రాజంపేట రూరల్: అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి, క్షత్రియ నాయకులు



రైల్వేకోడూరు అర్బన్: విప్లవ వీరుడికి నివాళి అర్పిస్తున్న కొరముట్ల, నాయకులు

రాజంపేట రూరల్ : భారత స్వాతంత్య్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని వైఎస్సార్‌సీపీ నియోజక ఇన్‌చార్జ్ ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. స్థానిక ఆర్‌అండ్‌బీ వద్ద ఉన్న మన్యం వీరుడి విగ్రహం వద్ద ఆయన జయంతిని శుక్రవారం క్షత్రియ సంఘం నాయకులు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి క్షత్రియ సంఘం నాయకులతో కలసి ముందుగా సీతారామరాజు విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. జోహార్ సీతారామరాజు అంటూ నినదించారు. తదనంతరం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. వేడుకలలో క్షత్రియ సంఘం నాయకులు డి.భాస్కర్‌రాజు, రేనాటి వెంకటసుబ్బరాజు, ఎ.వరదరాజు(బాబు), డి.వెంకటరాజు, రఘురామరాజు, శంకరరాజు, సుబ్బరాయుడురాజు, యల్లంరాజు, ఆర్.వెంకటరాజు, ఆదినారాయణరాజు, హస్తి లక్ష్మీకర్‌రాజు, మినివర్ధనరాజు, వెంకటసుబ్బరాజు, చంద్రరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి, మిరియాల సురేఖ, దండు గోపి, వడ్డె రమణ, పి.విశ్వనాథరెడ్డి, కే.రాజారెడ్డి, గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి, సోంబత్తిన శ్రీనివాసులు, రామ్‌నగర్ శివ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించామని బెటాలియన్ కమాండెంట్ కె. ఆనందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్య్రం వస్తుందని నమ్మి దాని కొరకే తన ప్రాణాలను అర్పించిన యోధుడు అని అన్నారు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడని కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పి.ఎస్.డి. ప్రసాద్, బి. వెంకటశివుడు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి ఆశయాలు భావితరాలకు ఆదర్శం

రైల్వేకోడూరు అర్బన్ : స్వాతంత్య్ర ఉద్యమ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలు భావితరాలకు ఆదర్శం కావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం అల్లూరి 128వ జయంతిని పురస్కరించుకొని పలువురు క్షత్రియ సంఘం నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి స్థానిక టోల్‌గేట్ వద్దనున్న అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని ధీరత్వం ఆయన సొంతమన్నారు. బ్రిటీష్ వారికి వెన్నుచూపక ఎదురు తిరిగి పోరాడిన యోధుడని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, శివప్రసాద్‌రెడ్డి, నాగేంద్ర, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

తెల్లదొరల పాలిట సింహ స్వప్నం

లక్కిరెడ్డిపల్లి : తెల్లదొరల పాలిట సింహ స్వప్నంగా నిలిచిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసి ప్రజల్లో విప్లవ జ్వాలలు రగిలించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ఆదికేశవులు, వెంకటరమణ (గురుస్వామి), మల్లికార్జున, బసయ్య, గురువు రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం: అల్లూరికి గౌరవం వందనం తెలియజేస్తున్న 11వ బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి



లక్కిరెడ్డిపల్లి: అల్లూరి చిత్రపటానికి బీసీ నాయకులు, క్షత్రియుల నివాళి

రేషన్ షాపు తనిఖీ

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లిలోని 11వ రేషన్ షాపును శుక్రవారం విజిలెన్స్ అధికారి శివన్న తన సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలో 159 కేజీల బియ్యం అధికంగా వ్యత్యాసం ఉన్నాయని తేలడంతో రేషన్ షాపు సీజ్ చేసినట్లు తహసీల్దార్ క్రాంతి కుమార్ తెలిపారు.

అవగాహన లోపంతోనే ఆరోపణలు



మాట్లాడుతున్న రమేష్

రైల్వేకోడూరు అర్బన్ : ఆర్యవైశ్య సంఘంలోని కొందరు అవగాహన లోపంతోనే ఆరోపణలు చేస్తున్నారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్ శుక్రవారం తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సమాజంలో వారు మాట్లాడుతూ ఆరోపణలు చేసేవారికి ఆలయంతోపాటు మండపం నిర్మాణంపై అవగాహన లేదన్నారు.

ప్రతి నెలా జరిగే రెండు సమావేశాలలో జమ, ఖర్చులు తెలియజేస్తున్నామన్నారు. అనుమానాలు ఉంటే సంఘం వద్దకు వచ్చి తెలుసుకోవచ్చని చెప్పారు. అధ్యక్ష ఎన్నిక 120 సంవత్సరాలుగా వచ్చే సంప్రదాయం ప్రకారం జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొప్పరపు నరసింహులు, పార్థసారధి, హరినాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ర్యాంకు సొంతం



కావ్యను మెమెంటోతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్

రాజంపేట టౌన్: బైపీసీ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే నీట్‌లో ర్యాంకు సాధించగలరని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు తెలిపారు. టి.కావ్య అనే విద్యార్థిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి గత ఏడాది నీట్‌లో ర్యాంకు సాధించి ప్రస్తుతం కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో కావ్యను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు జ్ఞాపికను అందచేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మనిషి అనుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అందువల్ల విద్యార్థులు కళాశాలలో చేరిన మొదటి రోజు నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత చదువులకు సంబంధించిన ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించగలరన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపైనే దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.చంద్రమోహన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల నాయకుడు రంగా



రంగా చిత్రపటానికి నాయకుల నివాళులు

రైల్వేకోడూరు అర్బన్ : వంగవీటి మోహనరంగా పేద ప్రజల నాయకుడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ కూడలి ప్రధాన రహదారిలో రంగా 78వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి సమాజంలో ప్రతి ప్రజానాయకునికి రంగా ఆదర్శనీయుడన్నారు. పేదవాడికి అన్ని సమయాలలో అండగా వుంటూ ప్రజాసేవ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, నందాబాల, మారెళ్ల రాజేశ్వరమ్మ, సి.చలపతి, మండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం



సింగం క్రిష్టారెడ్డి

సిద్దవటం : రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ బియ్యం పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు సింగం క్రిష్టారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సీపీ హయాంలో ప్రజలకు వాహనం ద్వారా ఇంటింటికి రేషన్ బియ్యం సరఫరా చేసేవారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను తొలగించి రేషన్ షాపు వద్దనే ప్రజలకు బియ్యం పంపిణీ చేసి బేషుగ్గా ఉన్నట్లు ఒక ప్రధాన పత్రికలో(సాక్షి కాదు) కథనం ప్రచురించడం సిగ్గుచేటన్నారు. కొన్ని ప్రాంతాల్లో దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం పోయి రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మరి కొందరు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకెళ్లలేక రేషన్ షాపుల వద్దనే డీలర్లకు అమ్ముకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రేషన్ బియ్యం సరఫరా చేసే వాహనాలను తొలగించి అందులో పనిచేసే వారి కడుపుకొట్టిందన్నారు. కావున రేషన్ బియ్యం సరఫరా చేసే వాహనాలను పునరుద్ధరించి ప్రజలకు ఇంటి వద్దనే రేషన్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీలో మహిళలకు అగ్రస్థానం



వైఎస్సార్‌సీపీ నాయకులను సన్మానిస్తున్న మహిళలు

రాయచోటి : మహిళలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గౌరవం, గుర్తింపుతోపాటు ఆర్థిక ఎదుగుదల ఉండేదని రాష్ట్ర మహిళా నేతలు మొయిళ్ల గౌరీ రెడ్డి, కాయితీ మహితా ఆనంద్‌లు అన్నారు. శుక్రవారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా పార్టీ కార్యాలయంలో మహిళా నాయకురాళ్లు మీడియాతో మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా చేయూతనిచ్చే సంక్షేమ పథకాలలో మహిళలకు అగ్రతాంబూలమిచ్చిన జగనన్న పరిపాలనకు, కూటమి పాలనకు ఉన్న తేడాను వివరించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు రీకాలింగ్ బాబు మేనిఫెస్టో కార్యక్రమంలో మహిళా విభాగం చురుకైన పాత్రను పోషిస్తామని చెప్పారు. అనంతరం అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సత్కరించారు.

ఘనంగా చిన్న సరిగెత్తు



పుల్లంపేట : మండల పరిధిలోని కోనెయ్యగారిపల్లి గ్రామంలో శుక్రవారం మొహర్రంను పురస్కరించుకుని పీర్ల చావిడి వద్ద చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఈ గ్రామంలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం పీర్లను ఎత్తుకొని గ్రామంలో ఊరేగించారు. ప్రతి ఇంటివారు పీర్లకు చదివింపులు (బొరుగులు, కడ్డీలు) సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. పండుగ వేడుకలు చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున పీర్ల చావిడి వద్దకు చేరుకుంటున్నారు.

ప్రతి అర్హుడికి ప్రభుత్వం ఇంటి పట్టా ఇవ్వాలి

రాయచోటి టౌన్ : ప్రతి అర్హుడికి ప్రభుత్వం ఇంటి పట్టా ఇవ్వాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.ఉదయ్ కిరణ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ ఒక్కరికి కూడా ఇంటి పట్టా ఇవ్వలేదన్నారు. పట్టణ ప్రాంతంలోని నిరుపేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలోని నిరుపేదలకు మూడు సెంట్ల కేటాయించడంతో పాటు ఇళ్లు కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరు విశ్వనాథ్, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణ, సుబ్బమ్మలు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



పోటీలో బండను లాగుతున్న ఎద్దు

వీరబల్లి : మొహర్రంను పురస్కరించుకుని మండలంలోని ఈడిగపల్లిలో నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. శుక్రవారం జరిగిన ఈ పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోటీల్లో పాల్గొనడానికి కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 15 జతల ఎద్దులను యజమానులు తీసుకువచ్చారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు రూపంలో నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ పోటీలను ప్రారంభించారు. స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : మండల అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని మండల అధ్యక్షులు మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ రాధాకృష్ణన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా మండల అభివృద్ధికి ప్రతి అధికారి, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, వైస్ ఎంపీపీలు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, ఎంపీటీసీలు సోమిశెట్టి సునీత, కసిరెడ్డి రమేష్‌రెడ్డి, పునగాని వెంకటసుబ్బమ్మ, సుబాన్‌బాషా, ఎగ్రపంతి, మోదుగుల సుబ్బమ్మ, సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గాలివీడు : మండల పరిధి చీమలచెరువు పల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిరసాని గురివిరెడ్డి(70) మరణం పార్టీకి తీరనిలోటని రాష్ట్ర మాజీ డీసీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఆర్.రమేష్ కుమార్ రెడ్డిలు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్నదానం



మాట్లాడుతున్న ఎద్దుల సుబ్బరాయుడు

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు శ్రీ సౌమ్యనాథ స్వామి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు ఎద్దుల సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ స్వామి వారి కల్యాణం సందర్భంగా సీనియర్ టీడీపీ నాయకులు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో, 12వ తేదీ రథోత్సవం రోజు రెజెన్సీ సంస్థల యజమాని జీఎస్ నాయుడు సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన అన్ని రోజులు ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి సుబ్బయ్య, మోడ పోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు దారి ఏర్పాటు



జేసీబీతో రైతులకు రస్తా వేస్తున్న అధికారులు

సిద్దవటం : మండలంలోని జ్యోతి గొల్లపల్లె రెవెన్యూ పొలంలో గత 10 సంవత్సరాల నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు రస్తా లేకపోవడంతో అక్కడి రైతుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రస్తాను ఏర్పాటు చేశామని తహసీల్దారు ఆకుల తిరుమల బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మెయిన్ రోడ్డు నుంచి డీకేటీ పొలంలో సగం వరకు రస్తాను ఏర్పాటు చేయగా కొంత మంది రైతులు నిలుపుదల చేశారన్నారు. దీంతో రెవెన్యూ రికార్డును పరిశీలించగా అక్కడ రస్తా ఉన్నట్లు తేలిందన్నారు. దీంతో మిగతా రస్తాను ఎస్ఐ మహమ్మద్ రఫీ పోలీసు బందోబస్తు నడుమ జేసీబీ యంత్రంతో రోడ్డును వేయించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహ ప్రసాద్, సర్వేయర్ మంచు కలందర్, వీఆర్ఓ ప్రభాకర్‌రెడ్డి, చైన్‌మెన్ సలాం, పోలీసులు, వీఆర్ఏలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వీరేంద్రసింగ్

ఒంటిమిట్ట : డెంగ్యూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ లోక్‌మాన్ వీరేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం డెంగ్యూ మహోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కొత్తమాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, కీటకజనిత వ్యాధులు గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే.. ఫ్రైడేగా పాటించాలన్నారు. ప్రతి సోమవారం దోమలకు నిలయమైన ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించి అబేట్‌ను పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిద్ధవటం సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, ఒంటిమిట్ట పీహెచ్‌సీ మెయిన్ సూపర్‌వైజర్ భాస్కర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, సీహెచ్ఓ వనిత, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సమావేశం



అధికారులతో సమావేశమైన సబ్ కలెక్టర్ వైఖోమ్

రాజంపేట : రాజంపేట నియోజకవర్గ అభివృద్ధిపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సబ్ కలెక్టర్ వైకోమ్ నదియా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల పరంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించే అంశంపై చర్చించారు. విజన్ 2047లో భాగంగా నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులపై సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. కాగా ఈ సమావేశంలో టీడీపీ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొనడం గమనార్హం.

వ్యాపారస్తులు ఐకమత్యంగా మెలగాలి



మాట్లాడుతున్న ఇర్షాద్ అహమ్మద్‌ఖాన్

రాయచోటి జగదాంబసెంటర్ : వ్యాపారస్తులంతా ఐకమత్యంగా మెలగాలని జ్యువెలరీ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇర్షాద్ అహమ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో రాయచోటి వ్యాపార సంఘాల ఐక్యత కార్యక్రమం నిర్వహించారు. రాయచోటి పట్టణంలో ఉన్న అన్ని రకాల వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇర్షాద్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్‌లో వ్యాపారాలు తగ్గించి చిన్న వ్యాపారస్తులకు సహాయ సహకారాలు అందించి వారి అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో రెడీమేడ్ క్లాత్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్, పుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి, వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

సిద్దవటం : జ్యోతి గ్రామంలోని పశు వైద్యశాలలో శుక్రవారం మేకలు, గొర్రెల(జీవాలు)కు నట్టల నివారణ కార్యక్రమం చేపట్టామని వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంటు జిలానీ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచుపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ విజయరాజు సూచనల మేరకు మేకలు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మేకలు, గొర్రెలు మొత్తం 370 జీవాలకు నట్టల నివారణకు న్యూ మెట్రిన్ మందులను వేశామన్నారు. కార్యక్రమం ఈనెల 10వ తేదీ వరకు ఉంటుందని జీవాలు ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మూతపడ్డ పశు వైద్యశాల

సిద్దవటం : మండలంలోని ముమ్మడిగుంటపల్లె గ్రామంలో ఉన్న పశు వైద్యశాల గత కొన్ని రోజులుగా మూతపడింది. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జూనియర్ వెటర్నరీ అధికారి జూన్ నెల 9వ తేదీన జరిగిన బదిలీలలో కడప పశు సంవర్ధక శాఖ కార్యాలయానికి బదిలీ కాగా ఆ స్థానంలో బాబునాయక్‌ను నియమించారు. ఆయన ఇంత వరకు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఇక్కడి జీవాల రైతులు నట్టల నివారణ మందులకు మేకలు, గొర్రెలను తీసుకువస్తే గ్రామీణ పశు పశువైద్యశాలకు తాళాలు వేసి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై భాకరాపేట పశు వైద్యాధికారి డాక్టర్ శివశంకర్‌ను వివరణ కోరగా ముమ్మడిగుంటపల్లె పశువైద్యశాలకు బదిలీ అయిన ఉద్యోగి ఇంకా విధుల్లో చేరకపోవడంతో వైద్యశాల మూత పడిందని, పాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నట్టల నివారణ మందులు వేస్తామని ఆయన తెలిపారు.